వేదాంతభేరి

మే 2017 రూ. 10/-



Regd.No. TRP / 123 / 2015-17 May 2017 Rs.10/- R.No.8139/63

Date of Publication 26-04-2017, Permitted to post : 29th, 30th every month.

త్రినేత్ర వైద్యాలయము

భక్తకన్నప్ప కంటి ఆసుపత్రి.

శ్రీశుకబ్రహ్మాశ్రమము, స్వామి ప్రకాశానందనగర్, శ్రీకాళహస్తి, ఆం.ప్ర.

ఇందు నిరుపేదలకు ఉచితంగా కంటి చికిత్సలు చేయబడును. కంటిపొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడును. ఆపరేషన్ చేసిన వారికి ఉచితంగా భోజనాలు పెట్టబడును. ఉచితంగా మందులు మరియు 40 వ రోజు కళ్లద్దాలు ఇవ్వబడును. దీనికి విరాళమిచ్చువారికి 80 జి సెక్షన్ క్రింద ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. ఈ ఆసుపత్రి పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిచే స్థాపించబడినది.

ఈ పేజీ స్థల దాతలు

సుభద్రా చారిటబుల్ ట్రస్టు

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం

ॐ వేదాంతభేరి ॐ

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 50 మే 2017 సంచిక : 05

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య,శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు,ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు , విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మైలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు : శ్రీ శుకబ్రహ్మాశ్రమము, స్వామి విద్యాప్రకాశానంద నగర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు) శ్రీకాళహస్తి, పిన్ - 517640 ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పకవ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

సంపుటము : 50 మే 2017 సంచిక : 05

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఉత్తరాయణము - శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. ధ్యానము - శ్రీమలయాళస్వాములవారు - 11
05. శ్రీరామానుజాచార్యుల శిష్యకోటి - ఆచార్య కె.సర్వోత్తమరావు - 15
06. సామాజిక స్పృహ కలవారే నిజమైన తత్త్వవేత్తలు
- వేంకటరంగ రామానుజాచార్యులు - 18
07. భగవద్రామానుజుల సమదర్శనం-డా ॥ సముద్రాల లక్ష్మణయ్య - 24
08. మానవజన్మ సార్థకత - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 32
09. శుకమహర్షి బోధ - ఎస్.వి. భారతీలక్ష్మి - 37
10. శ్రీరామానుజ వైభవము - శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యస్వామి- 41
11. వార్తలు - 42

ముఖచిత్రం : విశిష్టాద్వైత స్థాపకులు
పూజ్య శ్రీ రామానుజాచార్యుల వారు

మే 10వ తేది శ్రీ భగవద్రామానుజ జయన్తి మరియు సహస్రాబ్ది

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

మేషార్ద్రా సంభవం విష్ణోర్దర్శన స్థాపనోత్సుకమ్ ।
తుండీర మండలే శేషమూర్తిం రామానుజం భజే ॥

తుండీర మండలంలో మేష శుద్ధ పంచమి గురువారం నాడు ఆదిశేషుని అవతారమై, వైష్ణవ మతమును స్థాపించే ఔత్సుక్యంతో అవతరించిన శ్రీరామానుజులను భజిస్తున్నాను.

యో నిత్యమచ్యుత పదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురోర్భగవతో2స్య దయైకసింధో
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

నిత్యమూ విష్ణు పాదపద్మాలు అనే స్వర్ణము నందలి వ్యామోహంతో తదితరములైన వాటిని తృణప్రాయంగా భావించిన వాడూ, దయా సముద్రుడూ, మా గురుదేవుడూ అయిన శ్రీ భగవద్రామానుజులు యొక్క చరణాలకు శరణాగతుడనవుతున్నాను.

---

1. మే 6వ తేది శనివారం అన్నవరం సత్యనారాయణ కళ్యాణం
2. 9వ తేది మంగళవారం నారసింహ యజన్తి
3. 10వ తేది బుధవారం గౌతమబుద్ధ జయన్తి
4. 10వ తేదిఅన్నమాచార్య జయన్తి
5. 14వ తేది నారదమహర్షి జయన్తి
6. 21వ తేది హనుమజ్జయన్తి



ఉత్తరాయణము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఆది మహాభారత సమయము. కురుక్షేత్ర రణరంగమున హోరాహోరి యుద్ధము జరుగుచుండెను. వ్యాసులవారు ఆ సమీపమున ఎచటికో పోవుచుండిరి. త్రోవలో ఒక అపూర్వ సంఘటన జరిగినది. వ్యాసులవారు పోవుచున్న దారిలో ఒకింత దూరమున ఒక చిన్న పురుగు అతి వేగముగ ప్రయాణించుచు త్రోవకు అడ్డముగ పోవుచుండెను. వ్యాసులవారికి ఆశ్చర్యము కలిగినది. ఈ చిన్న ప్రాణి ఇంత వేగముగ, ఇంత కంగారుతో ఏల పరుగెడుచున్నది ? దీనికి కారణమేమి ? అని తలంచి దాని సమీపమున కేగి, మాట్లాడు శక్తిని దానికి ప్రసాదించి ఆ ఋషిసత్తము డిట్లు ప్రశ్నించెను. ఓ పురుగుగారూ ! ఏమిటి తొందర? ఇంత వేగిరపాటుతో ఏల పయనించుచున్నారు ? అందులకు పురుగిట్లు సమాధాన మొసంగెను. మహాత్మా ! తమకు తెలియనిది ఏమున్నది . దూరము నుండి ఈ మార్గముపై ఒక రథము అతి వేగముగ వచ్చుచున్నది. నేను గనుక నెమ్మదిగ పోయినచో ఆ రథచక్రముల క్రిందపడి నలిగి పోవుదును. కాబట్టి అది రాక పూర్వమే ఈ మార్గమును దాటివేయదలంచి త్వరితముగ పోవుచున్నాను. ఆ వాక్యములను విని వ్యాసులిట్లు ప్రశ్నించిరి. ఓ కీటకమా ! నీవు ఇంత చిన్న ప్రాణివి కదా ! నీకు కూడ ప్రాణము మీద ఇంత తీపి ఏల ? అపుడు పురుగు ఇట్లు సమాధాన మొసంగినది.

మహాత్మా ! తాము అంతయు తెలిసినవారు. నేను చెప్పునది ఏమున్నది ? అయిననూ తమ ఆజ్ఞకు బద్ధుడనై నా మనోభావములను

తమ ముందు వ్యక్తపఱచుచున్నాను. ప్రాణికోట్లలో ఐహిక సుఖమునకు సంబంధించినంత వఱకు చిన్న పెద్ద అను తేడా ఏమిలేదు. అందఱు జీవులు కర్మచే బద్ధులై సుఖము, దుఃఖము ననుభవించుచున్నారు. మానవులు, దేవతలు విషయ సుఖమునెట్లు అనుభవించుచున్నారో, అల్ప ప్రాణులమగు మేమున్ను అట్లే అనుభవించుచున్నాము. స్వాదిష్టమగు వస్తువును భుజించునప్పుడు గాని, రమణీయమగు వస్తువును సందర్శించినపుడుగాని మనుష్యు డెట్లు ఆనందమనుభవించునో అట్లే మేమున్ను అనుభవించుదుము. మానవుల కెట్లు సంతానము కలదో మాకున్ను కలదు. వెయ్యేల ! ప్రాపంచిక సుఖమునకు సంబంధించినంతవఱకు మేము, మానవులు, దేవతలు అందరూ ఒకటే !పురుగు వచించిన ఆ గంభీరవాక్యములను విని వ్యాసులు సంతుష్టమానసుండై ఆచ్చోటు విడిచెను. ఆ సంఘటనను పురస్కరించుకొని ఆ మునివర్యుడు తదుపరి లోకమునకీ ప్రకారము తన సందేశమును వినిపించెను.

‘ ఓ మానవులారా ! ఓ ఉత్తమ జన్ములారా ! విషయ సుఖమే ప్రాణుల చరమ లక్ష్యమైనచో, వారు మానవులుగా పుట్టనవసరం లేదు. ఏ క్రిమికీటకములుగ జన్మించినను ఫరవాలేదు. అచట కూడ బోలెడంత విషయ సుఖము కలదు. అచట కూడ ఇంద్రియార్థములగు శబ్దస్పర్శాదులను చక్కగ అనుభవించుటకు అవకాశము కలదు. మానవ జన్మయో పరమార్థము తెలిసికొనుటకు ఏర్పడినది. స్వస్వరూప సాక్షాత్కారమొనర్చుకొని జన్మసార్థకత బడయుటకే మానవజన్మ భగవంతునిచే ప్రసాదింపబడినది. అట్టి అమూల్య జన్మను క్రిమికీటకాదు లనుభవించు ఐహికసుఖమునకే వెచ్చించుట పాడి కాదు. పశు వికారములందు పాడు చేయుట న్యాయము కాదు.దుర్వృత్తులకు లోను చేయుట ధర్మము కాదు. లెండు ! తెలిసికొనుడు ! ఆత్మసాక్షాత్కారమను మీ కర్తవ్యమును సాధించి సార్థకజన్ములు కండు !

బాదరాయణుని ఈ దివ్య సందేశము జనులకు కనువిప్పు కాగలదు. **స జాతో యేన జాతేన యాతి వంశః సమున్నతిమ్**

ఎవడు తన్ను తాను తెలిసికొని, తన హృదయమున వెలుగుచున్న ఆత్మజ్యోతిని సాక్షాత్కరించుకొనునో, ఎవడు పరమ పవిత్రమగు దైవ అనుభూతినిబడయునో, అట్టివాడే వాస్తవముగ పుట్టినవాడు. ఎవనివలన వంశము, కులము, దేశము, ఉద్ధరింపబడునో అతడే పుట్టినవాడు. ఎందఱో పుట్టుచున్నారు, గిట్టుచున్నారు. చెట్లు పుట్టుచున్నవి. చేమలు పుట్టుచున్నవి. మృగములు పుట్టుచున్నవి. క్రిమికీటకాదులు పుట్టుచున్నవి. కాని అవి పుట్టినట్లా ? కాదు. జన్మసార్థకత లేని జీవితము జీవితము కాదు. వసిష్ఠ మహర్షి ప్రోక్తములగు ఈ క్రింది వాక్యము లిట్టి భావమునే వ్యక్తీకరించుచున్నవి.

జాతా స్త ఏవ జగతి జన్తవః సాధుజీవితాః

యే పునర్నేహ జాయన్తే శేషా జరఠగర్దభాః

పవిత్రజీవితము గడుపువారే ఈ ప్రపంచమున వాస్తవముగ జన్మించినవారు. మఱియు జన్మరాహిత్యమునకు కావలసిన సాధనలను చక్కగ ఆచరించి పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మపదవిని పొందినవారే. నిజముగ పుట్టినవారు. తక్కినవారు మానవులలో లెక్కింపదగినవారు కారు.

కావున పుట్టిన ప్రతివారును తిరిగి జన్మబంధమున తగుల్కొనకుండ తప్పించుకొనుటకు ఉపాయమేదియో ఆలోచించ వలసియున్నది. అజ్ఞానమున్నచో కర్మ తొలగదు. కర్మ తొలగనిచో జన్మ తొలగదు. కావున అజ్ఞానము నిర్మూలమగుటయే జన్మ కర్మల బెడద తప్పించుకొనుటకు ఏకైక ఉపాయము. దేహరూప ఉపాధియందు సాక్షిభూతముగ వెలుగుచున్న ఆత్మను, పరబ్రహ్మమును సాక్షాత్కరించు

కొనుటయే జన్మబంధ వినిర్ముక్తుడగుటకు చక్కని మార్గము. కాబట్టి ముముక్షువగు వాడు విషయసుఖములకై ప్రాకులాడక, అమూల్య సమయమును వానికొఱకు వెచ్చించక వానికై పరుగిడి క్రిమికీటకాదుల సామ్యమును బడయక, మానవత్వమును కాపాడుకొని, మానవత్వము నుండి మాధవత్వమునకు ఎగబ్రాకి సార్థకజన్ముడై వర్తించవలెను. జీవితమున ఉత్తరాభిముఖుడై చనవలెనేకాని దక్షిణాభిముఖుడు కారాదు. ఉత్తరాయణమునే అనుసరించవలెను గాని దక్షిణాయనమును కాదు.

అనాదియగు సంసార బంధనమున తగుల్కొని నానా యాతనలను అనుభవించుచు పుట్టుచు, చచ్చుచునున్న జీవుడు ఆ దుర్భరతాపమును భరించలేక శాంతికై మార్గమేదియని అన్వేషింపదొడగును. పెద్దల నాశ్రయించి శాస్త్ర పరిచయమొకింత సంపాదించి తరణోపాయమును వెతకికొనును.

కిం మూఢ ఇవ తిష్ఠామి ప్రేక్ష్యే2హం శాస్త్రసజ్జనైః

ఇంతకాలము నేనేల మూఢుడుగ వర్తించి కాలము నంతయును వృథా చేసితిని. ఇపుడు బుద్ధి తెచ్చుకొని సద్గురువులను, సచ్ఛాస్త్రములను ఆశ్రయించి ముక్తి మార్గము నన్వేషించుదును అని తలంచి అధ్యాత్మ మార్గమున ప్రవేశించును. **ఇదియే జీవునకు ఉత్తరాయణము.**

అయనము అనగా మార్గము. ఉత్తరాయణ మనగా ఉత్తరమార్గము. సూర్యుడు ఉత్తరాభిముఖుడై పోవుకాలము మహాపుణ్యప్రదముగ, మహాపవిత్రముగ ఎంచబడుచున్నది. కనుకనే ఆ దినమున జనులు గొప్ప పండుగను, గొప్ప వేడుకను జరుపుకొనుచున్నారు. అదియే సంక్రాంతి పండుగ.పండుగ లన్నిటిలో అది ముఖ్యమైనదిగా భావింపబడుట వలన దానిని పెద్ద పండుగ అనియు పేర్కొనుచుందురు.

అట్లే జనులు ఎప్పుడు అధోమార్గమును (అజ్ఞానమును, దుర్గుణావలంబనమును) వదిలివైచి ఊర్ధ్వమార్గమున పయనమై పోవుదురో (సద్గుణములను అవలంబించుదురో) అదియే వారి జీవితములో శుభ ముహూర్తము. అదియే వారి జీవితకాలమున పెద్ద పండుగ. అట్టి పండుగను జరుపుకొనువారు ధన్యజీవులు, చరితార్థులు, మహితాత్ములు. వారు క్రమక్రమముగ ఊర్ధ్వమార్గమున పయనమైపోయి తుదకు జీవితచరమలక్ష్యమగు పరమాత్మను చేరుకొందురు.

భువన్ భులాయిని మా భవమోహిని

– శ్రీ రామకృష్ణ పరమహంస

అమ్మా ! లోకాన్నంతా మాయతో కప్పివుచ్చావే. మూలాధార చక్రంలో పెద్ద పద్మంలో కూర్చొని వీణవాయిస్తూ ఆనందిస్తూంటావు. ఈ దేహంలో వుంటూ ఈ దేహాన్నే వాద్యపరికరంగా మార్చి త్రిగుణాలనే మూడు స్వరాలలో సంచరిస్తూ ఇడ పింగళ సుషుమ్నా అనే మూడు తంతువులను మీటుతూ ఆనందించే నువ్వు మహామంత్ర స్వరూపిణివి. అమ్మా ! మూలాధారంలో 'భైరవ' రాగంగా, ఆరుదళాల స్వాధిష్ఠానంలో 'శ్రీరాగం'గా, మణిపూరంలో 'మల్లార'రాగంగా, అనాహతంలో 'వసంత' రాగంగా అభివ్యక్తమౌతూ హృదయాన్ని ప్రకాశింప జేస్తూంటావు.

అట్లే విశుద్ధ చక్రంలో 'హిందోళ' రాగంగా, ఆజ్ఞాచక్రంలో 'కర్నాటక' రాగంగా అభివ్యక్తమౌతూంది.

గుణత్రయమనే మాయ జీవుని దృష్టిని కప్పివేయడంచేత ఆ పరతత్త్వం మరుగున పడింది "

ధ్యానము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

(గత సంచిక తరువాయి)

ఇక మీరు గ్రహించవలసిన గొప్ప విషయము మరియొకటి గలదు. దీనియందు జాగరూకత వహింపకపోయినచో జన్మము యొక్క సంపూర్ణ క్లేశము తొలగదు. అదేమన ? కొందరు ఈలాగున చెప్పెదరు. మీలో కొన్ని తెగలవారు పాపులనియు, దైవకార్యము చేయుటకు యోగ్యత లేనివారనియు, నీచజన్మము గలవారనియు, పుణ్యకార్యము లన్నిటిలోను అనర్హులనియు ఏమేమో బలికెదరు. ఈలాటి వచనములను చెప్పువారు మీకు విషము పోసెడువారలని మరువకుడు. మీరు పరిశుద్ధులనియు, మీయాత్మ దైవస్వరూపమనియు, మీరు కరుణాళులనియు, దేహేంద్రియ కరణముల కన్యులనియు, శుద్ధజ్ఞానమే స్వరూపముగా గలవారనియు, మీ యొక్క యోగ్యత ననుసరించిన సమస్త దైవప్రాప్తి కార్యములు చేయుట కర్హతగలదనియు చెప్పువారే మీకు అమృతము పోసి రక్షించెడువారలు. మీరును మీ యొక్క గుణకర్మములను చక్కబరచుటలో శ్రద్ధగలవారలై యుండిన మాత్రముననే పై జెప్పిన వచనము సార్థకమగును. అనాత్మజడ ప్రకృతివాదులను మనవారు నాస్తికులనియు, వేదవిరుద్ధులనియు పేర్కొనియున్నారు. ఆత్మను గురించి బోధించువారు ఆస్తికులనియు, వేదానుకూలురనియు మనయొక్క సచ్ఛాస్త్ర సిద్ధాంతము కావున సోదరులారా ! మీరు నాస్తికులై పోవుటకు చూడకుడు. ఆస్తికులై వర్తించుటకు ప్రవర్తింపుడు. జనులందరిచేతను శుద్ధకర్మ చేయించి పరిశుద్ధులుగా చేయుటకు ప్రయత్నింపుడు. సోదరులారా ! సోదరీమణులారా! మీరు పరిశుద్ధ దైవస్వరూపులు, కరుణాళువులు, నిత్యముక్తులు, ప్రశాంత గుణముగలవారను భావనయే మీరు చేయవలయును. మనయొక్క మనస్సు ఊర్ధ్వాధముగా అతివేగముగ తిరుగునటువంటి యంత్రము. అనాత్మ భావనచేతను, కర్మల చింతనచేతను, ఆత్మగుణములను చూడక కేవలము కల్పిత కులగోత్రాదుల చూచుటచేతను ఈ మనస్సు మిమ్ములను అతల వితల పాతాళములకు గొనిపోయి పైశాచికముగ మార్చును. మీరు ఇంద్రియములకును దానికృత్యములకును సాక్షియై వెలిగెడు శుద్ధబోధస్వరూపులు అను ఆత్మభావన మీ మనస్సు నూర్ధ్వముగా గొనిపోయి సువర్లోక జనలోక తపోలోక సత్యలోకములకు అవతల కందజేసి, దైవసదృశులుగా చేయునని సత్యముగా నమ్ముడు.

ఇక చెప్పబోయెడు ధ్యానము పైచెప్పిన వాటి యన్నిటిలోను ముఖ్యమైనది. దీనిని చేసిన వారు మరల దుఃఖము నొందరు. ఇదిశివము, అద్వైతము, అమృతము, శాంతము, ఆనందము. దీనికి ముందుగా నుదాహరించిన మార్గములద్వారా యీ స్థితిని పొందవలయును, సంస్కారాత్ములైనచో ఈ జన్మములోనే పైనజెప్పిన అనుష్ఠానములన్నియు పనిలేదు. దానియొక్క నిర్ధారణము గురువుపై ఆధారపడి యున్నది. లేనిచో వేదాంత విచారణయు, శుద్ధబుద్ధియు, మహాపురుషుల సంసర్గము నుండిన వారి వారి అవస్థను వారు వారు గనుగొనవచ్చును. ఇది ప్రకృతిలేని స్థితియని మరువకుడు. పూజలన్నియు స్థూలదేహమునకు సంబంధించినవి. కీర్తన జపాదులు సూక్ష్మ దేహము నంటియుండును. ధ్యానము బుద్ధికిని, కారణ దేహమునకును సంబంధపడి వెల్గుచుండును. ఈ మూడు మెట్లును ప్రకృతితో గూడినవే గాని ప్రకృతిరహితములు గావు. యోగము గూడ ఇంతవరకు మాత్రమే రాగలుగును.. అవతల

స్థితియే మీరు పొందవలసిన పరమపదము. అదే శివము, అదే మీ స్వరూపము. దీనిని మొదట ఓంకార ధ్యానము చేసి శీలింపవచ్చును. క్రమముగా ఓంకారముయొక్క మూడు పాదములనెడు విశ్వ తైజస ప్రాజ్ఞులను, స్థూల సూక్ష్మ కారణములను విడిచి, నాల్గవదగు తురీయస్థితిని చేరవలెను. అచ్చట జీవేశ్వరుల ఉపాధి ద్వయమును విచారించి విడిచిపెట్టి ఐక్యమును కనుగొనవలెను. అప్పుడు ఘటాకాశ, మేఘాకాశ ఉపాధిద్వయమును తొలగించిన, మహాకాశము మిగులునట్లు, మీరు నిత్యబోధ స్వయంప్రకాశస్వరూపులగుదురు. ఇచ్చట ధ్యాతయు, ధ్యేయమును ఏకము కావలసియుండును. అనగా ధ్యానము చేయువాడును, ధ్యానింపదగిన దైవమును ఐక్యము గావలయును. అప్పుడు మీ ఆత్మచేతనే యివి అన్నియు ప్రకాశించుచున్నవనియు, మీరు నిత్య చైతన్య జ్ఞాన స్వరూపులనియు స్వయముగా గోచరించును. ఈ అవస్థ జ్ఞప్తికి తగులుటయే తత్త్వమసి యను వేదాంతశ్రవణమగును. ఇట్లు గలుగక విషయాసక్తులై కర్మ దృష్టిచే బద్ధులైనవారు ఎన్ని జన్మములు శ్రవణము చేసినను, చిలుక పలుకులవలె నిసుమంతయు ప్రయోజనముండదు. ఈ ధ్యానమును మూడు మార్గములుగా విభాగించవలయును. మొట్టమొదట సంయములై దేహేంద్రియములను చక్కగా నిలిపి సుస్థిరులై చక్కగా కూర్చుండవలయును. తరువాత ఒకడు ఆత్మయొక్కలేక దైవము యొక్క మహిమను గురించియు, ధ్యానరీతిని గురించియు, ఫలమును గురించియు కొంతసేపు ఉద్బోధించ వలయును. తరువాత పరంపరలో గల ఋషులను, అనగా ప్రవక్తలను గురించి ధ్యానించుట ధర్మము. రెండవది దైవమును గురించిన ఉపనిషద్వాక్యములను లేక ఆత్మతో సంబంధించిన ఉపనిషత్ మూలములను గాని, శ్లోకములను గాని, పద్యములనుగాని, వాక్యములనుగాని పఠించుట యుపయోగకరము. వీటివల్ల మనస్సు బహిర్విషయములనుండి ఉపరతి

నొందును. తరువాత అందరును కొంతసేపు తన్మయాకారులై యుండవలెను. అప్పుడు సత్స్వరూపము ఆత్మమాత్రమై శేషించి యుండు విధి నొందవలయును. అప్పుడే సంకల్పములు నశించును. దృశ్యమైన ప్రపంచము ప్రశమనము నొందును. ప్రచండభాస్కరునిచే తమస్సు నశించునట్లు అజ్ఞానముగాని, కర్మముగాని, కర్మఫలముగాని కనుపడదు. హృదయగ్రంథులు అప్పుడు విచ్ఛిన్నములగును. సంశయములన్నియు నెచ్చటనో పారిపోవును, కర్మ కట్టెలు సంపూర్ణముగ భస్మమగును. దృశ్యముజలములో పడవేసిన మంచుగడ్డ క్రమక్రమముగా లీనమై జలమయ మగునట్లుసంపూర్ణముగా దృక్కైన దైవముగా మారును.

ధ్యాతృ ధ్యానం పరిత్యజ్య క్రమాద్ధ్యేయైక గోచరమ్ ।
నివాత దీపవచ్చిత్తం సమాధి రభిధీయతే ॥

అనగా ధ్యానించువాడగు ధ్యాతయు, ధ్యానమనెడు వృత్తియు, విడిచి ధ్యేయాకారమగు ఆత్మయై, గాలిలేనిచోట నుండు దీపమువలె చలింపక స్వస్వరూపుడై నిలుచుటయే సమాధియనం బరగెడు నిర్వాణస్థితి యని మరువకుడు.

ఓం శివో2హం శివో2హం శివో2హమ్

ఇచ్చోట దాసో2హం దాసో2హం దాసో2హం అని గూడ చింతించు వారుండినచో, అట్లుగూడ చేయవచ్చును. ఇదియు దృఢముగా రూఢిపడినచో బంధవిముక్తి పరమగు ఆనందము గలుగును. సుగుణసంపత్తి లేనివాడై శివో2హ మని ఉచ్చరించుటకన్న సుగుణాన్వితుడై, దాసో2హమని యుచ్చరించుటయే పరమపావనము. వీడు క్రమముగా దైవత్వమును పొందును, సందియము లేదు.

యదా సర్వే ప్రముచ్యంతే కామాయే2స్య హృది శ్రితాః ।
అథ మర్త్యో2మృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥

వేదాన్తభేరి ... చంద్ర
మురళీధర కృష్ణుడు
ollow the master

శ్రీరామానుజాచార్యుల శిష్యకోటి

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

రామానుజాచార్యులవారు విశిష్టాద్వైతమత స్థాపకులు. 120 సంవత్సరాలు జీవించిన పూర్ణాయుష్కుడు. రామానుజుల జీవితం ఏటికి ఎదురీత, పర్వతశిఖరం చేరుకోవడానికి పరుగు. ఎన్నో రకాలయిన అడ్డంకులున్నా సముద్రం కేసి పరుగులు తీసే నది.

రామానుజాచార్యులవారు ఒకరి దగ్గరే విద్యాభ్యాసం చేయలేదు. ఆచార్యుల గురువులు ఐదుగురు. పెరియనంబి దగ్గర ఆళ్వారుల దివ్య ప్రబంధసారాన్ని నేర్చారు. తిరుక్కోట్టియార్ నంబి దగ్గర తిరుమంత్ర రహస్యాలు గ్రహించారు. తిరుమలై యాండాన్ దగ్గర తిరువాయ్‌మొళి వ్యాఖ్యానం విన్నారు. తిరువరంగ పెరుమాళ్ళరైయర్ దగ్గర చరమోపాయాన్ని శ్రద్ధగా విన్నారు. పెరియ తిరుమలై నంబి దగ్గర తిరుపతి అలిపిరి దగ్గర శ్రీమద్రామాయణ రహస్యాలు ఆసక్తితో ఆలకించారు.

రామానుజుల శిష్య సంతతి కూడా అసంఖ్యాకం. రామానుజుల వారితో వాదం చేసి ఓడిపోయి ఆ మహానుభావునికి ‘ అడియేన్’ అన్న వారెందరో. వారిలో అద్వైత గురువు యాదవ ప్రకాశులు ప్రముఖులు. ఆలాగే తిరుక్కోష్టివూర్ గోపురం ఎక్కి ‘జిజ్ఞాసువులారా ! రండిరండి’ అని ఎలుగెత్తి ఆహ్వానించి వచ్చిన వారికందరికి తిరుమంత్రం ఉపదేశించి శిష్యకోటిని పెంచుకొన్న వారు రామానుజులు. వీరేగాక తనకు సన్నిహితులయి తనపట్ల గురుభావము గలవారయి తానేది ఆదేశిస్తే ఆలాగే చేసే శిష్యకోటి అనంతమయినా వారిలో కూరత్ఆళ్వార్,

అనంతాళ్వార్, ధనుర్దాసులు సుప్రసిద్ధులు.

కాంచీపురానికి దగ్గర “కూరమ్ ” అనే ఒక గ్రామం. అక్కడివాడే కూరత్తాళ్వార్. ఇతడు నిరంతరం అన్నదానంచేయడం కారణంగా వరదరాజస్వామికూడా ఆశ్చర్యపోవడం ఒక ప్రత్యేకత. వారు రామానుజులకు చాలా సన్నిహితులు.

రామానుజులు జీవించిన [illegible] వారు. అతడు పరమశివభక్తుడు. విష్ణుద్వేషి. తన రాజ్యంలో శివభక్తులే ఉండాలని అతని నిర్ణయం. అంచేత పండితుల సలహాల మేరకు ‘శివాత్పరతరం నాస్తి ’(శివుని కంటె మరియొక పరాత్పరుడు లేడు) అని తాటాకు మీద వ్రాసి సంతకాలు పెట్టించుకొనేవాడు. కొందరు రాజుతో విరోధం ఎందుకని సంతకాలు పెట్టేవారు. కాని వైష్ణవాచార్యులు సంతకాలు చేస్తేనే తన కోరిక నెరవేరుతుందని రాజు భావించాడు. వెంటనే రామానుజులకు రమ్మని కబురు చేశాడు. రాజాజ్ఞవిన్న రామానుజులు రాజాజ్ఞ ధిక్కరించరాదని తానే వెళ్ళాలనుకొన్నారు. కాని కూరేశులవారు ఇందులో ఏదో కుట్ర ఉందని, వెళ్ళితే ప్రాణహాని అని రామానుజులను నివారించారు. అంతేకాదు తానే ‘రామానుజులుగా’ వెళతానన్నారు. రామానుజుల కాషయం ధరించి వెళ్ళాడు. చోళరాజు యథాప్రకారం ‘ శివాత్పరతరం నాస్తి ’ దగ్గర సంతకం చేయమన్నాడు. కూరేశులవారు ఆలాగే అంటూ ‘శివాత్పరతరం నాస్తి ద్రోణమతః’పరమ్’ అని వ్రాసి సంతకం పెట్టారు. రాజు మండిపోయాడు. కూరేశుల అభిప్రాయంలో శివ ద్రోణ రెండూ కొలతపాత్రలు. ‘శివ’ కంటె ద్రోణం పెద్దది అని అభిప్రాయం. రాజు కూరేశుల కళ్ళు పీకించమన్నాడు. కూరేశులవారే గోళ్ళతో తన దృష్టి పోగొట్టుకున్నారు. ఈ వార్త తెలిసి

ఎవడో బ్రాహ్మణుడు ?

మూలం
బుద్ధుని ధర్మపదం

అనువాదం
– బ్రహ్మచారి ఆనందమోహన్

రామానుజులు చాలా బాధపడ్డారు. మేల్కోటె నుండి తిరిగి వాచ్చాక వరదరాజస్వామిని ప్రార్థించి కూరేశుల వారిని అనుగ్రహించారట. గురువుకు శిష్యుల ఎడగల దయకు ఇది తార్కాణం.

గుర్వాజ్ఞను శిరసావహించిన మరో శిష్యుడు 'అనంతాళ్వార్' శ్రీరంగంలో రామానుజులవారు గోష్ఠిలో 'తిరుమల పుష్పమంటపం. అక్కడ పుష్పకైంకర్యం చేసేవారున్నారా అని ప్రశ్నించారు. శిష్యులు గతుక్కుమన్నారు. కారణం తిరుమలలో చలి ఎక్కువ, పైగా దుష్ట జంతువుల సంచారం. శిష్యులు కిమ్మనకుంటే అనంతాళ్వార్ లేచి ' గుర్వాజ్ఞ అయితే నేనే వెళతాను ' అన్నారు. రామానుజులు సంతోషించారు. గుర్వాజ్ఞ మేరకు అనంతాళ్వార్ తిరుమలలో చెరువు త్రవ్వి తోట నిర్మించి జీవితాంతం పుష్పకైంకర్యం చేశారు. అతని సేవపట్ల కృపతో రామానుజులు 'బాగ్‌సవారి ఉత్సవం " (స్వామి అనంతాళ్వార్ తోటకు అప్రదక్షిణంగా రావడం) ఏర్పాటు చేశారు.

తరువాతి వారు 'ధనుర్దాసు'. అతనికి భార్య అంటే అమిత ప్రీతి. ఆమె అందచందాలపై తెలియని ఆకర్షణ. ఆమెకు గొడుగుపడుతూ ఆమె కళ్ళనే చూస్తూ నడిచేవాడట. రామానుజులు ధనుర్దాసును రంగనాథుని భక్తులుగా చేయాలనుకున్నారు. ధనుర్దాసుతో ' నీ భార్య కళ్ళకంటే అందమయిన కళ్ళు చూపిస్తాను. " అన్నారు. ధనుర్దాసు సరేనన్నాడు. రామానుజులు ధనుర్దాసుకు శ్రీ రంగనాథస్వామి కళ్ళు చూపించారు. అంతే ధనుర్దాసు స్వామి ముందు సాగిలబడ్డాడు. శిష్యుడయ్యాడు. రామానుజులు 'ధనుర్దాసును' గౌరవిస్తూ ఉత్సవ సమయాలలో ఉత్సవవరుల దగ్గర రక్షణగా నిలబడే బాధ్యత అప్పగించారు.

వీరేకాదు రామానుజుల అనుగ్రహం పొందిన శిష్యకోటి అనంతం.

రామానుజస్య చరణం శరణం ప్రపద్యే.

సామాజిక స్పృహ కలవారే నిజమైన తత్త్వవేత్తలు

– వేంకట రంగ రామానుజాచార్యులు

ఈ భరతభూమిమీద అనాదిగా ఎందరో మహానుభావులు ఆవిర్భవిస్తున్నారు. ఆయా కాలాల్లో, తాము ఆచరణ సాధ్యమైన విధానాన్ని తమ జీవన ప్రక్రియలో నిరూపించడమే కాక, ఆచరణ సులభమైన సంప్రదాయ రీతిని, మత విశ్వాసాన్ని, దర్శన సిద్ధాంతాన్ని లోకానికి అందించగలిగినప్పుడు మాత్రమే వారు కృతకృత్యులు కాగలుగుతారు. ఈ దేశంలో ఎన్నో సిద్ధాంతాలు, ఎన్నో సంప్రదాయాలు, మతవిశ్వాసాలు ఆవిర్భవించి కాలగర్భంలో కలిసిపోయాయి. ఇలా ఆవిర్భవించిన మహానుభావుల్లో శంకర, రామానుజ, మధ్వ, చైతన్యాదులు మేధావుల హృదయాల్లోనూ, సాధారణ జనుల హృదయాల్లోనూ స్థిరస్థానం కలిగించుకున్నారు. భగవద్రామానుజులు ఆవిర్భవించి 2017 మే నెల 10వ తేదీనాటికి వెయ్యి సంవత్సరాలు అవుతుంది. వారి సహస్రాబ్ది.

భగవద్రామానుజులు తమ సిద్ధాంతాన్ని సంప్రదాయ రీతిని సామాన్యజనులకు సైతం అర్థమయ్యేలా అనుష్ఠాన యోగ్యంగా చేసారు. రామానుజులు తాము ఆచరించి చూపిన సాంప్రదాయిక ఆచరణ విధానాలల్లో అందరికీ ఉపాదేయమైనది ప్రపత్తి. బాదరాయణుడు బ్రహ్మ సూత్రాల్లో భక్తియోగాన్ని గురించి చెప్పినా అది అందరికీ ఆచరింప రానిదని ఒక అధికరణంలో నిష్కర్షించాడు. శంకరభగవత్పాదులు, వారి ముందువారు, తరువాత వారు ఆ మార్గంలోనే తమ బ్రహ్మసూత్ర హృదయావిష్కరణం కావించారు. రామానుజులు కూడా వ్యాస మార్గాన్ననుసరించి ఒక అధికరణంలో భక్తియోగం అందరికీ ఆచరణ సాధ్యం కాదని దానిని ఆచరించడానికి అందరికీ అధికారం లేదని చెప్పారు. కాని సమాజంలో అధికారుల కంటే (అర్హులు కంటే) అనధికారులే ఎక్కువ. ఎవరో కొందరికోసం ఉద్దేశింపబడిన భక్తియోగం

కంటే మరింత సులభమైన మార్గమేదైనా ఉందా అని ఆలోచించి ఆగమాలలో చెప్పబడి ఆళ్వారుల శ్రీసూక్తులలోను, వారి అనుష్ఠానంలోను సుస్పష్టమైన, ప్రపత్తి అనే మార్గాన్ని వారు ఆశ్రయించి ఆచరించి లోకానికి **'శరణాగతి గద్యం'**' అనే గ్రంథం ద్వారా అందించారు. భగవద్రామానుజ ఆశయాన్ని స్పష్టంగా గుర్తించిన ఆచార్యులు తమ గ్రంథాలలో ప్రపత్తి వైభవాన్ని ఉటంకించారు. ప్రపత్తి అంటే ఇతరేతరాలైన సాధనాలనన్నింటినీ విడిచిపెట్టి భగవంతునే ఉపాయంగా స్వీకరించడం. ఒకవిధంగా, భాగవతంలో

" నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్ "

అంటూ ఇతరేతర సాధనాలన్నీ విడిచి, నీవే తప్ప మరొకరు లేరు అన్న, పరిపూర్ణ విశ్వాసంతో భగవంతుని గజేంద్రుడు ఆశ్రయించినట్లుగా, "ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని కోరికలు ఉన్నా అన్నింటికీ ఆయన ఒక్కడే ఆశ్రయింపదగినవాడు. మరింకొక్కరు లేరు " అన్న మహావిశ్వాసాన్ని ప్రోదిచేసుకోవడమే ప్రపత్తి. సమాజంలో ఇలాంటి నిష్ఠ చాలా అవసరం. ఈనాడు ఏ చిన్న బాధ కలిగినా వీరు కాదని వారిని, వారిని కాదని మరొకరిని రోజుకొక్కరిని ఆశ్రయిస్తూ ఒక నిబద్ధతలేని విధానాన్ని కొనసాగిస్తున్నారు మానవులు. అలాకాదని మానవకోటి అంతా ఆశ్రయింపదగిన ఒకే ఒక్క పరదైవతాన్ని చూపించి ఆయననే అనన్యభావనతో ఆశ్రయించండని బోధిస్తూ తాము ఆచరించి చూపిన మహానుభావులు భగవద్రామానుజులు. ఇలా భగవంతుని ఆశ్రయించే మానసిక ప్రవృత్తి లేనివారికోసం కూడా, వారి పక్షాన శరణాగతి చేశారు. శ్రీ రంగనాథుని సన్నిధిలో భగవద్రామానుజులు. కన్నబిడ్డ ఆరోగ్యం కోసం తల్లి పథ్యం చేసినట్లుగా దీన జనుల ఉద్ధరణం కోసం తామే భగవంతుని ఆశ్రయించి, ఈ లోకులంతా ఆశ్రయించినట్లుగా భావించమని ప్రార్థించారు రంగనాథుని. ఆర్తికలిగినప్పుడు ఎవనికైనా కరావలంబనం కావాలి. అలా చేతినందేవాడు దయాది గుణాలు కలవాడు కావాలి.

వైద్యుని దగ్గరకు వెళ్ళడానికి ప్రతి వ్యక్తి అర్హుడే. ఇక్కడ ఉచ్చ - నీచాలు, ధనవంతులు - దరిద్రులు, పండితులు - పామరులు అనే తేడా ఏమాత్రం లేదు. అలాగే ఆర్తికలవాడెవడైనా ఆర్తి తీరడానికి కళ్యాణ పూర్ణుడైన భగవంతుని ఆశ్రయించవచ్చును. ఇక్కడ తరతమ భేదాలు లేవు అని చాటి, మేల్కొటే అనే ప్రదేశంలో **తిరుకులత్తార్** అనే పేరుంచి నిమ్నజాతులవారిని నేరుగా ఆలయంలో ప్రవేశింపచేశారు. రామానుజులు. ఆ విధానమే తిరుమల వంటి క్షేత్రాలలో ఇప్పటికీ సాగుతున్నది.

రామానుజులకు ముందు, ఆర్తిగొన్నవాడు, తనలాగే ఈ సంసారంలో కష్టసుఖాలు అనుభవిస్తున్న మరొక వ్యక్తిని కాక, ఉత్తమ యోగ్యతకల ఒక తత్త్వాన్ని ఆశ్రయించవచ్చునన్న మార్గం స్పష్టంగా లేదు. ఆనాడు ఆచార్యులు ఏ గుణాలూ లేని కంటికి అగుపించని ఒక నిర్గుణ, నిర్వికార తత్త్వాన్ని చూపించి తమ దర్శన సిద్ధాంతాన్ని చాటారు. ఈ నిర్గుణ, నిర్వికార తత్త్వం ఆర్తుల ఆర్తిని తీర్చడానికి సకల కళ్యాణ గుణాలూ కలిగి మనమంతా ఆశ్రయింపదగిన ఒక పరదైవతం ఉందని ఆయన నారాయణుడని భగవద్గీతాది శాస్త్రాలు రామాయణ మహాభారతాలు, విష్ణు భాగవతాది పురాణాలు ఈ తత్త్వాన్నే బోధిస్తున్నాయని, ఈ తత్త్వాన్ని ఆశ్రయిస్తే అది మనకు చేయూతనిచ్చి అన్ని కష్టాల నుండి మనను వెలికి తీస్తుందని ఒక దృఢమైన విశ్వాసాన్ని రామానుజులు అందించారు. ఇందుకోసం శ్రీరంగం, కంచి, తిరుమల మొదలైన ఎన్నో క్షేత్రాలను ఉద్ధరించారు.

ఏ దర్శన సిద్ధాంతమైనా అందరికీ సులభమై, ఆచరణ సాధ్యమైన ఒక జీవన విధానాన్ని అలవరిచేదైనప్పుడు మాత్రమే ఆ సిద్ధాంతం సార్వజనీనం, సార్వకాలికం అవుతుంది. ఈ రహస్యాన్ని గుర్తించిన రామానుజులు వేదాలలోను, రామాయణాది ఇతిహాసాలలోను, విష్ణు

పురాణాదుల్లోను ఎలుగెత్తి చాటబడిన ఒక దర్శన సిద్ధాంతాన్ని లోకానికి అందించారు. ఆ సిద్ధాంతం, ఈ సమస్త ప్రపంచము కంటికి కనిపించే చెట్టు – పుట్టలు, రాయి – రప్ప, నదులు –సముద్రాలు, వివిధ ప్రాణి కోటులు వీటన్నింటితో నిండి ఉండి భగవంతునికి శరీరంగా అమరి ఉందని చెపుతున్నది. " ఎవని శరీరాన్ని వాడు రక్షించుకున్నట్లు, తనకు శరీరమైన ఈ ప్రపంచాన్నంతటినీ క్రమబద్ధంగా నడిపి, అనుక్షణము దీనిని రక్షించుకొనవలసిన బాధ్యత ఆ భగవంతునిది. అలాగే ఈ భగవంతుని శరీరంలోనే వివిధ అవయావాల్లా అమరి ఉన్న ఈ ప్రపంచంలోని చైతన్యం కలిగిన వస్తువులు, చైతన్యం లేనట్లుగా కలిపించే వస్తువులు అన్నీ తమ ఉనికిని గుర్తించి, ఒక శరీరంలోని ఒక అవయవానికి మరొక అవయవం హానికలిగింపని విధంగా సామరస్యంతో శరీరావయవాలన్నీ కలసికట్టుగా ఆ శరీరంలోని ఉన్న జీవునికి ప్రయోజనాన్ని సాధించి పెట్టినట్లుగా భగవంతుని శరీరమైన ఈ ప్రపంచంలోని అన్ని తత్త్వాలు, ఒకదానితో ఒకటి కలసి సమరసంగా ఏకలక్ష్యంగ ఉండాలి, అలా ఉండేలా చేయగలవాడు జీవుడు మాత్రమే. అలా జీవులు తమ బాధ్యతను గుర్తించి సామరస్యంతో ఉన్నప్పుడే ఈ ప్రపంచపు మనుగడ భద్రంగా ఉంటుంది అన్న అద్భుత సిద్ధాంతాన్ని లోకానికి అందించారు రామానుజులు.**"జగత్సర్వం శరీరంతే"**(ఈ ప్రపంచమంతా నీ శరీరమే) అని రామాయణం బోధిస్తుంది.

జ్యోతీంషి విష్ణుః భువనాని విష్ణుః సరాంసి విష్ణు స్సరితస్సముద్రాః అని విష్ణు పురాణం ఉద్ఘోషిస్తుంది. ఈ కనిపించే నక్షత్రాలు, భువనాలు, సరస్సులు నదీసాగరపర్వతాలు ఇవన్నీ విష్ణు శరీరాలే అని దీని అభిప్రాయం. ఇలాంటి భావన కలిగినప్పుడు ఈ సృష్టిలో ఉన్న ఏ వస్తువూ మరొక వస్తువును బాధించలేదు. ఏ వస్తువు బాధింపబడ్డా, దాని ప్రభావం మరొక దానిమీద పడుతుంది. కనుక మొత్తం శరీరమే పీడింపబడుతుంది. ఒక శరీరంలోని చెయ్యి అదే శరీరంలోని మరొక చేతిని బాధించదు, ఒక కన్ను మరొక కన్నును బాధించదు. అంతేకాదు ఇతరమైన వాటివల్ల తమలోని ఏ అవయవానికి బాధకలగకుండ ఉండేలా ఆ శరీరావయవాలన్నీ కలిసికట్టుగా పనిచేస్తాయి. ఇలా కలసికట్టుగా పనిచేసేలా చేస్తుంది బుద్ధి. భగవంతుని శరీరమైన ఈ ప్రపంచంలో కూడా ఇదే విధమైన అనోన్య సామరస్యధోరణి అలవడాలని, జీవులంతా దీన్ని అలవరచుకోవాలని చెప్పడమే భగవద్రామానుజుల శరీర శరీరి భావ సిద్ధాంతం. ఇది వేదసారం.

రామానుజుల దృష్టిలో ప్రపంచం అసత్యం కాదు. బౌద్ధులు ఇదంతా శూన్యం అన్నారు. మిథ్య అన్నారు. లేని ప్రపంచమే ఉన్నట్లు గోచరిస్తోందని వాదించారు. ఈ వాదనలన్నింటిని రామానుజ సిద్ధాంతం అంగీకరించలేదు. ఈ జగత్తంతా సత్యమేనని, సర్వకళ్యాణ గుణపూర్ణుడైన భగవంతుని శరీరమని ఎలుగెత్తి చాటింది. పారస్పరిక ప్రేమను ప్రతిబోధించింది. భగవత్ ప్రేమను ఉద్ఘోషించింది. " అంతేకాదు ఈ ప్రాణులు చేసే ధర్మ బద్ధమైన పనులన్నీ భగవదారాధనమేనని ఎలుగెత్తి చాటింది. రామానుజుల సిద్ధాంతంలో భగవదారాధనం కాని కర్మ ఏదీ అపేక్షితం కాదు, సార్థకం కాదు. చేసేవాడికి ఉపకరిస్తూ చుట్టూ సమాజానికి ఉపకరించే ఏ పనైనా ధర్మమే. అదే కర్మయోగం. ఈ కర్మ వల్ల ప్రీతిగొన్న భగవంతుడు ఫలాన్నిస్తాడు. ఇదే భగవదారాధనంగా ఉత్తారకం అవుతుంది." అని సమాజంలో సత్కర్మనిష్ఠను అలవరిచారు రామానుజులు. వేదాలు బోధించిన యజ్ఞాల్లో ఉన్న హింసాభాగాన్ని హింసకు తావులేని విధంగా సంస్కరించి, యజ్ఞాలన్నీ భగవదారాధనాలుగా మలచి వేద సిద్ధాంతాన్ని నిలబెట్టారు. అని పెద్దలు రామానుజులు చేసిన వైదిక కర్మ సంస్కారం గురించి చెబుతారు.

ఇలాంటి సర్వసమరస భావననూ, విశ్వప్రేమను లోకానికి చాటిన మహనీయులైన రామానుజులు మానవజాతికి భగవంతుడు అందించిన సమతామూర్తి. ఈయన ఆవిర్భవించి వేయి సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఎన్నో బృహత్తర కార్యక్రమాలు ఈ దేశంలో సాగుతున్నాయి.

వారిపట్ల తమ కృతజ్ఞతను ఆవిష్కరించడానికి ఎందరెందరో అత్యుత్సాహంగా ముందుకు వస్తున్నారు. మన శంషాబాద్‌కు దగ్గరలో ముచ్చింతల్ గ్రామపు పరిధిలో ఉన్న మన శ్రీరామనగరంలో, మనం నిర్మించుకోదలచిన 216 అడుగుల భగవద్రామానుజ విగ్రహానికి పరిపూర్ణ రూపాన్ని సంతరింప చేసే కార్యక్రమం వేగంగా సాగుతోంది. మనమిచ్చిన రామానుజుల మూర్తిని, తు.చ. తప్పకుండా విభిన్న విభాగాలుగా నిర్మించి, శ్రీరామనగరంలోని విగ్రహ ప్రతిష్ఠాపనానికి ఉద్దేశించిన స్థలంలో అమర్చ డానికి జూలై నెల నుండి విశేషంగా ప్రయత్నం సాగుతోంది. ఇదొక మహోద్యమం. చైనా నుండి విడి విడిగా భాగాలు ఇక్కడకు చేరి ఒక రూపాన్ని సంతరించుకోవడానికి ముందు, దానికి తగిన ఎత్తైన పీఠాన్ని నిర్మించాలి. పీఠ నిర్మాణానికి కావలసిన సన్నాహం వేగంగా సాగుతోంది. జూలై నాటికి పీఠ నిర్మాణంపూర్తవుతుంది. ఇక తరువాయి, విగ్రహ భాగాల అమరికయే. ఇది చాల పెద్ద ప్రయత్నం. ఇలాంటి ప్రయత్నం ఇది వరకెప్పుడూ జరుగులేదు. ఇకముందు జరుగుతుందేమో తెలియదు. ఆర్తి కలిగి ఆచార్యుని పట్ల కృతజ్ఞతను ఆవిష్కరించుకోదలచినవారికి ఇప్పటి కంటే మించిన మరొక సదవకాశము కలుగబోదు. యథాశక్తిగా, ఈ సమతామూర్తి విగ్రహ నిర్మాణానికి సంబంధించిన విశేషాలు రామానుజ సహస్రాబ్ది నిర్వాహక సమితి ద్వారా తెలుసుకొని, మనమంతా భాగస్వాములమౌదాం. విశ్వప్రేమను, సర్వ మానవ సౌభ్రాత్రాన్ని చాటిన రామానుజుల కీర్తివిశ్వవ్యాప్తమైయ్యేలా మనం కూడా భాగస్వాములమౌదాం. రండి ! ఇది కేవలం మత ప్రచారోద్యమం కాదు. ఒక సామాజిక మహోద్యమం.

రామానుజ సహస్రాబ్దీ జయతాత్ నిరవగ్రహా ।
సమతామూర్తి సంక్రాంతిః హృదయేష్వస్తు న స్సదా ॥

(భక్తి నివేదన పత్రిక నుండి వారి సౌజన్యంతో)

(పూజ్యశ్రీ భగవద్రామానుజుల సహస్రాబ్ది సందర్భంగా)

శ్రీ భగవద్రామానుజుల సమదర్శనం

- డా ॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

పరోపదేశ వేళాయాం సర్వే వ్యాసపరాశరాః ।
స్వానుష్ఠానే తు సంప్రాప్తే మునయోఽపి న పండితాః ॥

ఇతరులకు ధర్మాన్ని ఉపదేశించునప్పుడు అందరూ వ్యాసునిలాగానో, పరాశరుని మాదిరిగానో మాట్లాడతారు. కాని తాము అనుష్ఠించవలసిన సందర్భం తటస్థించినప్పుడు మునులు గూడా ఆత్మ దర్శనాన్ని ఆచరణలో పెట్టే పండితులుగా ఉండడం లేదు.

సనాతన ధర్మంలో సమత్వ సిద్ధాంతానికి ప్రముఖస్థానం ఉన్నది. కాని ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టే వారెందరు ?

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాస్సమదర్శినః ॥

అన్న గీతాశ్లోకం అందరికీ పరిచితమే. విద్యా వినయాలు గల విప్రుని యందూ, గోవునందూ, ఏనుగు నందూ శునకము నందూ, శ్వపచుని యందు సైతం ఆత్మజ్ఞులు సమదృష్టి గలిగి వుంటారని భావం.

అన్నమాచార్యుల వారు సమబుద్ధిని గూర్చి ఇలా అన్నారు.

సమబుద్ధే యందరికీ -సర్వ వేదసారము
సముడిందరికీ హరి - సాధనమో యయ్యా
చీమకు తన జన్మము - చేరి సుఖమై తోచు
దోమకు తన జన్మము - దొడ్డ సుఖము,
ఆ ముని ఈగకు సుఖ - మా జన్మమై తోచు
ఏమిటా ఎక్కువ సుఖ -మెవ్వరీ కేదయ్యా ?

ఈవిధంగా సమబుద్ధిని వేదాలూ, శాస్త్రాలూ, తత్త్వవేత్తలూ ఉద్ఘోషించడం జరిగింది. కాని భారతావనిలో ఇందుకు విరుద్ధంగా వర్ణభేదమూ, కులవ్యవస్థా, విషమ దృష్టి, పరస్పర ద్వేషమూ విజృంభించాయి. అంటరానితనం వంటి దురాచారాలు ప్రబలాయి. దీన్ని నిరోధించిన వారూ, నిరోధించడానికి పాటు పడినవారూ చరిత్రలో చాలా అరుదుగానే కనిపిస్తారు. అలా కనిపించే వారిలో అగ్రగణ్యులు శ్రీ భగవద్రామానుజులు.

శ్రీ భగవద్రామానుజులు ఈ లోకంలో అవతరించి వెయ్యేండ్లు గడచిపోయాయి. పుట్టి గిట్టడంలో విశేషం లేదు. కాని తన జీవిత కాలంలో లోకోద్ధారక కార్యాలు నిర్వహించి చరిత్రపై తనదైన గాఢముద్ర వేసి వెయ్యేండ్లైనా మరపురాని మహనీయుడుగా నిల్చిపోయిన ఆచార్య శ్రేష్ఠులు శ్రీరామానుజులవారు. వారిని ఈ సహస్రాబ్ద్యుత్సవాల సందర్భంలో స్మరించడం పుణ్యప్రదం. అది మన కర్తవ్యం కూడా.

భగవంతుని ప్రేరణతో ఈ లోకంలోకి వైకుంఠం నుండి ధర్మస్థాపనకై దిగివచ్చిన ఆదిశేషులుగా శ్రీ రామానుజుచార్యులు ప్రసిద్ధి పొందారు. వారు ప్రచారంలోకి తెచ్చిన విశిష్టాద్వైత దర్శనం శ్రీరామానుజ దర్శనం అన్న పేరుతోనే ప్రచారంలోకి వచ్చింది.

సమాజంలో సమత్వం మాటలకు మాత్రమే పరిమితమై, ఆచరణకు దూరమై విషమత్వం విలయతాండవం చేయడాన్ని చూచి ఆచార్యులవారు సహించలేకపోయారు. ఆ దుఃస్థితిని చక్కదిద్దడానికి తీవ్ర కృషి గావించారు. అందులో సఫలత సాధించారు. అందువల్లనే వారిని సంఘసంస్కర్తగా, లోకోద్ధారకులగు మహాపురుషులుగా, ఇతరాచార్యుల కంటె విశిష్టమైన వ్యక్తిత్వం కలవారుగా లోకం గుర్తించింది.

' అంతర్యామి'గా భగవంతుడు అంతటా వ్యాపించి యున్నాడు.

'ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేऽర్జున తిష్ఠతి ' అని గీతాసూక్తి. సర్వప్రాణుల హృదయదేశంలో పరమేశ్వరుడు నెలకొని యున్నాడు.

" ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వేదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణి ! "వింటే" అని ప్రహ్లాదుడు తన స్వానుభవాన్ని తండ్రికి వివరించాడని భాగవతం బోధిస్తున్నది.

అయినా వర్ణ వ్యవస్థ, కులకాలుష్యం, భేదదృష్టి – వీటివల్ల వేదం బోధించిన సమదర్శనం అడుగంటిపోయింది. మన మతాచార్యులు, పరమాత్మునియొక్క పరవ్యూహ విభవార్చా స్వరూపాలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని ' అంతర్యామి స్వరూపానికి ఇవ్వలేకపోవడం మిక్కిలి విచారకరం. అందువల్ల సమాజంలో సమదర్శనం గగన కుసుమమై పోయింది. విషమత్వం వెల్లి విరిసింది.

'' గురువు బోధించిన తిరుమంత్రాన్ని ఇతరులకు ఉపదేశింపరాదు. అలా చేస్తే నరకప్రాప్తి తప్పదు " అని హెచ్చరికలుండి నప్పటికీ, సామాన్య జనానీకాన్ని గూడా మంత్రోపాసనతో తరింపజేయాలన్న దృష్టితో గురుని ఆదేశాన్ని అతిక్రమించి శ్రీ రామానుజులు గోపురమెక్కి వారూ, వీరూ అనే తేడా లేకుండా అందరికీ తిరుమంత్రాన్ని ఉపదేశించారు. వారు ఎంతటి హృదయ వైశాల్యం కలవారో దీనివల్ల గ్రహించవచ్చు. ఇలా జరిగిందని తెలుసుకొన్న గురువు గోష్ఠీ పూర్ణులు శిష్యుని విశాల హృదయాన్ని ప్రశంసించి 'మన్నాథా' (ఎం బెరుమానారు) అని వారిని సంబోధించారు.

ఆనాటి మహామహులలో శ్రీకాంచీపూర్ణులు ఒకరు. వారు నేరుగా భగవానునితో సంభాషించేవారు. వారి భుక్త శేషాన్ని స్వీకరించాలను కొన్నారు శ్రీరామానుజులు. కాని వారి ధర్మపత్ని శ్రీ కాంచీపూర్ణులు తక్కువ కులంవారన్న కారణంగా భర్త సత్సంకల్పాన్ని సఫలం కానీకుండా అడ్డుపడింది. అలా జరిగినందుకు శ్రీరామానుజులు ఎంతో ఖేదం పొందారు. వారు తమ ధర్మపత్నిని పరిత్యజించడానికి ఇది గూడా ఒక

కారణమయింది.

ఇప్పటికీ మన సమాజంలో కుల కాలుష్యం సమసిపోలేదు. వెయ్యి సంవత్సరాలకు ముందే ఈ దుర్వ్యవస్థను చక్కదిద్దటానికి పూనుకొన్న శ్రీరామానుజులను ఏమని కీర్తించగలము ?

ధనుర్దాసుని స్పృశించినందుకు ' శూద్రస్పర్శ తగునా ? ' అని ఆచార్యులవారిని శిష్యులు ఆక్షేపించారు. అప్పుడు ఆచార్యులవారు వారికి హితం బోధించారు. విద్యామదం, ధనమదం, అభిజనమదం, గర్వగ్రస్తులకు ఉంటాయనీ, అవియే సజ్జనులకు వ్యత్యస్తాలై దమాలు (మదం - దమం) గా మారతాయనీ బోధించారు. ధనుర్దాసులోని మంచితనాన్ని గ్రహించవలసినదిగా శిష్యులకుపదేశించారు.

అంతేకాదు ధనుర్దాసు భార్య హేమాంబ ధరించిన ఆభరణాలు దొంగలింప జేసిన వృత్తాంతం ద్వారా శిష్యులకు ప్రత్యక్షంగా తక్కువ కులంవారుగా భావింపబడిన ధనుర్దాస దంపతుల ఔన్నత్యం నిరూపించి కులగర్వం తగదని హెచ్చరించారు ఆచార్యులవారు.

సుజనుల పట్ల దుర్జనులు నిష్కారణంగా శత్రుత్వం వహిస్తారు. శ్రీరామానుజులవారికి గూడా ప్రబల శత్రువులు కొందరు ఏర్పడ్డారు. అయినా వారి తపోబలం, సౌశీల్యం వారిని కాపాడింది.

ఆ దినాలలో శైవులకూ, వైష్ణవులకూ ప్రబల శత్రుత్వం ఉండేది. శైవులవల్ల ఆచార్యులకు ముప్పు వాటిల్లే సందర్భాలు గూడా తటస్థించాయి. అయినా ఆచార్యులవారు తమ అవతార కార్యనిర్వహణ మార్గం నుండి వైదొలగలేదు. నిశ్చితార్థాన్ని సాధించి విజయం పొందారు.

ఇప్పటి కాలంలో గూడా శైవవైష్ణవుల మధ్య భేదదృష్టిని ప్రస్తావిస్తూ ' శ్రీధర్మ సేతువు' అన్న గ్రంథంలో శ్రీ సద్గురు మలయాళస్వాముల వారు ఇలా వ్రాశారు.

" శైవమతస్థులు అప్పుడు రామానుజాచార్యులకున్నూ, తదనుయాయులకున్నూ కలుగజేసిన ద్రోహముచే కాబోలు శ్రీవైష్ణవ సంప్రదాయంలో కొందరికి శైవమందును, శివభక్తుల యందును ద్వేషము కల్గినదని తోచుచున్నది. శ్రీరామానుజులు పరమైకాంత భక్తికి ఆధిక్య మిచ్చిరి. ప్రపత్తి వల్లనే జీవులకు వైకుంఠప్రాప్తి కలుగునని ఉపదేశించిరి. ఇది పరమభక్తి మతము." (శ్రీ ధర్మసేతువు - 259 - 260 పుటలు)

శ్రీరామానుజాచార్యులవారు బోధించిన ప్రపత్తి (శరణాగతి) మార్గంలో నడవడానికి వర్ణ వ్యత్యాసం, కులభేదం, లింగభేదం, ఇత్యాదులు ఆటంకం కావు. వారూ, వీరూ అనే భేదం లేకుండా అందరినీ భగవదనుగ్రహానికి పాత్రులను చేసే ఉత్తమ మార్గమిది, అందరూ తరించడానికి అనువైన ఈ మార్గాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన ఆచార్యవర్యులను గురించి

గతులన్నిఖిలమైన కలియుగ మందున
గతి యాతడే చూపె ఘన గురు దైవము.

అని అన్నమాచార్యులవారు గురుత్వ - దైవత్వ సమ్మేళనంగా కీర్తించారు.

శ్రీ భగవద్రామానుజులు తమ జీవితంలో ఎన్నో క్లిష్ట పరిస్థితుల నెదుర్కొన్నారు. అయినా ధర్మమార్గం నుండి ఏమాత్రం ప్రక్కకు తొలగకుండా నిష్ఠాగరిష్ఠులై వుండినారు. కులభేదం లేకుండా అందరినీ అక్కున జేర్చుకున్నారు. శరణాగతి (ప్రపత్తి) మార్గాన్ని అందరికీ అందుబాటులోనికి తెచ్చారు.

శ్రీరామానుజచార్యులవలె ఇతరాచార్యులు గూడా తమ ఆచార్యత్వాన్ని సార్థకం చేసుకొని వుంటే, సమదృష్టి కల్గి వుంటే సమాజం అన్ని విధాలా శ్రేయోమార్గంలో పయనించి వుండేది. శాంతికీ, సుఖానికి ఆలవాలమై యుండేది.

అట్టి ఆచార్యులు ఈ భారతావనిలో పునః పునః అవతరించేటట్లు భగవంతుడు అనుగ్రహించుగాక !!! సమదర్శనం విజయమొందుగాక !

ఉద్ధవుడు

మూలం :

శ్రీ అఖండానంద స్వాములవారు

అనువాదం:

శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు

(జనవరి తరువాయి)

తన అంతరంగిక ప్రేమికుడైన ఉద్ధవుని పలుకులు విని శ్రీకృష్ణ భగవానుడన్నాడు – " ఉద్ధవా ! నీ వాక్కులు పరమసత్యాలు. త్వరలోనే యీ ద్వారక సాగరగర్భంలో మునిగిపోతుంది. ప్రపంచంలో అధార్మికులు వర్ధిల్లుతారు. ఇక నువ్వు అందరి స్నేహాన్నీ విడిచిపెట్టు. నిజజ్ఞాన స్వరూపంలో స్థితుడవై శాంతినిపొందు. కేవలం నాయందే మనస్సును లగ్నంచేసి సమదృష్టి గలవాడవై భూమిపై సంచరించు. ఉద్ధవా ! ప్రాకృతమైన మనస్సు ఇంద్రియాలద్వారా గ్రహింపబడే వస్తువులన్నీ వినాశకరమైన మనోమయమై, మాయామయమైనవే. విశుద్ధాంతఃకరణం లేని వానికి నానావస్తువులూ గోచరమవుతాయి. అతడే 'ఇది గుణము ఇది దోషము ' అని ఆలోచించుకుంటాడు. అట్టివాడు కర్మ, అకర్మ, వికర్మ అన్న చక్రంలో పడిపోతాడు. కాబట్టి ఏకాగ్రచిత్తంతో యీ జగత్తును ఆత్మలో దర్శించు. ఆత్మను నాలో దర్శించు. ప్రకృతి కానీ, ప్రాకృత వికారోత్పన్న విఘ్నాలేవీ నిన్ను ప్రభావితం చెయ్యజాలవు. నిన్ను స్పృశించజాలవు. నీలో నువ్వు సంతుష్టుడవుకా. గుణదోషాలు రెండింటికీ అతీతుడవుకా. సర్వత్రా నన్నే దర్శించు. క్షణకాలం కూడా దానినుండి చ్యుతుడవు కాకు".

శ్రీకృష్ణుని ఉపదేశవాక్యాలు విని ఉద్ధవుడు అనేక ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ వాసుదేవుడు సవిస్తరంగా సమాధానం యిచ్చాడు. భాగవతంలోని ఏకాదశ స్కంధంలో అధికాంశభాగం ఉపదేశాలతో నిండి వుంది.

భగవంతుడిలా పలికాడు – "నీకు నువ్వే మేలును కలిగించుకోవాలి. కళ్యాణ మార్గంలో ఇతరులు కొద్దిగానే సహకరించ గలుగుతారు. నాకు సర్వజీవులూ ప్రియమైనవే. అయినా మానవులు అత్యధిక ప్రియులు. తనకు తానుగా అనుసంధానం చేసుకోగలవాడు నన్ను పొందగలుగుతాడు. కావాలనుకుంటే ప్రతివస్తువు సహకారాన్ని పొందగలుగుతావు. భూమి నీకు క్షమను ఉపదేశిస్తుంది. ఆకాశం అసంగత్వాన్ని నేర్పుతుంది. సూర్యుడు సమదృష్టిని గురించి బోధిస్తాడు. పశుపక్ష్యాదుల నుండియే కాదు. చివరకు తృణాల నుండి కూడ ఉపదేశాన్ని గ్రహించవచ్చును. దత్తాత్రేయుడు ఇరువది నాలుగు మంది గురువుల ద్వారా ఉపదేశాన్ని పొందగలిగాడు.

విశ్వంలోని వస్తువులన్నీ వినాశంవైపు పరుగుతీస్తున్నాయి. ఈ రాజభవనం, యీ స్వర్ణముద్రలూ, యీ గజాశ్వాలూ ఎందుకూ పనికిరావు. వీటివైపు దృష్టిని పోనీయకు. అంతర్ముఖుడవై కేవలం నన్నే పొందు. నువ్వు స్థూల, సూక్ష్మ కారణ శరీరాతీతుడవు. ఈ శరీరాలనే ఆత్మ అనుకోవడం వల్ల ఆవాగమన చక్రంలో పడి తిరుగవలసి వస్తున్నది. వీటన్నింటినీ విడనాడు. స్వర్గాన్ని సైతం లెక్కపెట్టకు. బ్రహ్మలోకాన్ని కూడ కోరకు. అతని ఆయుర్దాయం కూడ అల్పమైందే. అతడు కర్మపరతంత్రుడు. నిత్యముక్తుడవై నిత్య స్వతంత్రుడవైన ఆత్మవు నీవు."

" బద్ధుడూ, ముక్తుడూ " అన్నవి గుణదృష్ట్యా గోచరమవుతాయే కానీ నిజానికి లేవు. ఈ గుణాలు మాయామూలకాలు. కాబట్టే నాలో బంధనముక్తులన్నవి లేవు. స్వప్నంలో బద్ధుడైనవాడు ముక్తికోసం ప్రయత్నించేవరకూ ఆతడు ముక్తుడుకాడు. స్వప్నభంగం కావడంతో యథార్థం వెలుగులోకి వస్తుంది. అట్లే మాయలో చిక్కుకున్న వాని దశకూడ

జ్ఞానంతో ఈ అజ్ఞానబంధాన్ని ఖండించు. ప్రాణేంద్రియ మనోబుద్ధులకు సంబంధించిన సంకల్పాలు చెయ్యకు. ఎవరినీ పొగడకు, ఎవరినీ నిందించకు, నిన్నెవరైనా పొగడినా, నిందించినా సమభావంతో ఉండు.

అత్యధికంగా విద్య లభించినా భగవత్తత్త్వ జ్ఞానం లభించకపోతే అది ఎందుకూ పనికిరాదు. నా పవిత్ర లీలాగుణవర్ణనలుకల విద్యయే నిజమైన విద్య. ఆత్మను గ్రహించడంలోనే విద్యాబుద్ధుల ప్రయోజనం వుంది. ఆత్మజ్ఞాన వాస్తవరూపంవల్ల నానాత్వభ్రాంతి దూరమవుతుంది. దానియందే మనస్సు సమర్పించు. బుద్ధిని నాయందు లగ్నంచెయ్. నువ్వు నావాడవు.నాయందే ఉంటావు. అలా నువ్వు స్వయంగా చెయ్యలేకపోతే సత్సంగం చెయ్. సాధుమహాత్ములు చెప్పిన ప్రకారం నా స్వరూపాన్ని ధ్యానించు. చింతించు. సాకార, నిరాకార, విష్ణు, రామరూపాలన్నీ నావే. వీటిలో దేనిని ధ్యానించినా శాంతి, దాంతి, తితిక్షాది గుణాలను పొందగలవు. నా గాథలనూ ఆలకించు.“నా వ్రతాలను చెయ్. నాకై నియమాలను పాలించు. ఏమి చేసినా నాకు అర్పించు.

“ నన్ను సుగమంగా పొందడానికి సత్సంగమే సాధన. యోగ, సాంఖ్య, ధర్మాదులు కఠినమైనవి. సత్సంగాన్ని అందరూ చేయగలరు. శూద్రులు, స్త్రీలు అనేకమంది దైత్యులూ, దానవులు పశుపక్ష్యాదులూ కూడ సత్సంగంద్వారానే నన్ను పొందగలిగారు. సత్సంగం ద్వారా నాయందు మనస్సును లగ్నం చెయ్. ఉద్ధవా ! నీకు గోపికలు గుర్తున్నారు కదా ! ఎంత తన్మయత్వంతో వారు నాచింతన చేస్తూన్నారు. నువ్వు విధి విధానాలను ఆశ్రయించడం విడనాడు. ప్రవృత్తి, నివృత్తి, శ్రుత, శ్రోతవ్యాలకు దూరుడవైపో, రా ! కేవలం నా శరణులోకి రా ! నీకు నిర్ణయస్థానం లభిస్తుంది.

మానవ జన్మ సార్థకత

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

నాలుగు ఆశ్రమములలో నున్న వారెవరైనను ఆత్మజ్ఞాన విచారణ ద్వారా ముక్తిని పొందుట కర్తవ్యలే. మానవ మాత్రునికి మోక్షమును పొందుటకు సమర్థత యున్నది.

ధర్మము నాచరించుచు, ధనాదులను సంపాదించి, ధర్మ బద్ధములైన కామములను అనగా కోరికలను అనుభవిస్తూ ముక్తికై జ్ఞానము నార్జింపవలెను. అపుడే మానవ జన్మ ధన్యమగును.

మానవ జన్మను పొంది, ధర్మనిరతను, జ్ఞాన సిద్ధిని సాధించనట్లయితే పశుతుల్యులగుదురు. ద్విపాద పశువులనబడుదురని శాస్త్రము, పెద్దల వాక్యము.

“ ఆహార నిద్రాభయ మైథునాని సామాన్య మేతత్
పశుభిర్నరాణామ్ ! జ్ఞానంహి తేషామధికో
విశేషః జ్ఞానేన హీనః పశుభిస్సమానః ॥
అథవా “ ధర్మేణ హీనః పశుభిస్సమానః ॥

భావము : ఆహారము, నిద్ర, భయము, మైథునము వీటియనుభవము. వీటిని సేవించుట మానవులకు. పశుపక్ష్యాదులకు సమానమే. ఆవులకు గడ్డి తినడమే మహానందము. మానవులకు మంచి రుచికరములైన భోజనమే మహానందము. మానవులకు ఏసి రూములు, మంచి పరుపులే ఆనందము, పందికి బురదలో నుండుటయే ఆనందము. దయామయుడైన ఒక యోగి బురదలో నుండే పందికి తన శక్తి ద్వారా దానికి మాటలాడే శక్తినిచ్చి

నిన్ను వైకుంతం తీసుకెళ్ళి యచ్చట మంచి రూమ్ ఇప్పించెదను నాతో రమ్మని చెప్పెను. ఆ పంది విని ఆ వైకుంతంలో ఈ బురద గుంట లుంటాయా అని యోగి నడిగెను. అచ్చట యుండవని యోగి చెప్పెను. ఈ బురద గుంటలలో నాకు కలిగే ఆనందము వైకుంతంలో నుండునని నమ్మకం లేదు. కావున నేను వైకుంమునకు రాను అని చెప్పెను. ఈవిధముగా మిగతా మూడింటిని భావించవలెను.

బ్రహ్మచర్యాశ్రమములో నున్నవారు వేదావేదాన్తాధ్యయనము, ప్రాతస్సాయంకాలములందు అగ్నిహోత్రము, గురుసేవ, గాయత్రీ మంత్ర జపము మున్నగునవి ఆచరింపవలెను.

ఎవరి కెఱుక ?

– ఆచార్య కె.సర్వోత్తమరావు (తిరుపతి)

... లేక 60 సంవత్సరములు గడిచిన తరువాత ...ప్పగించి ఉన్న ధనాదులచే తృప్తి పొంది, ...ధములకు భగవద్గీత, ఉపనిషత్తులు మొదలగు వాటిని శ్రవణ, మనన, నిధిధ్యాసనాదులను గావించి జ్ఞానము నార్జించి ముక్తిని పొందవలెను.

సంన్యాసాశ్రమము – మూడాశ్రమములలో నున్న వారెవరైనను, వైరాగ్యమును సంపాదించినట్లయితే కేవల మోక్షమును కోరిన వారైతే, వారందరూ సంన్యాసమును స్వీకరింపవచ్చును. “ యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్ ” అని శాస్త్ర వచనము

సింహమున కుండే పరాక్రమము మానవునకు లేదు. దానిమీద ఎన్ని శస్త్ర అస్త్రములు వేసిన అది ముందుకే ప్రయాణం చేయును. వెనుకకు మరలదు.

జంతువులైన పశుపక్ష్యాదులకు క్రూరత్వాది బుద్ధిని మార్చుకొనే సామర్థ్యము లేదు. మానవులు రజోగుణ, తమోగుణాభ్యాసమాలిన్యముతో దుర్వ్యసనములకులోనై దుష్ప్రవర్తననుసరించిన వాడైనను సజ్జనుల సహవాసము చేతను, సచ్ఛాస్త్ర పఠనములతో, సత్సంగములద్వారా చెడు ప్రవర్తనను వదలి, మంచి మార్గములో ప్రవేశించే సామర్థ్యము ఒక్క మానవునకే యున్నది.

ఉదాహరణకు : వాల్మీకి మహర్షి ముందు రత్నాంగదుడనే పేరు కలిగి యుండెను. బాటసారులనుండి అక్రమ ధనమును అపహరించి దొంగగా ప్రఖ్యాతి గాంచెను. నారదమహర్షి నీతిబోధచే దుష్ప్రవర్తన విడనాడి దివ్యమంత్రజపం చేసి మహర్షిగా విఖ్యాతి గాంచెను. వారు రచించిన రామాయణమునే వాల్మీకి రామాయణమందురు. సామర్థ్యముండి మార్చుకొననివాడు పశువుతో సమానమని భావన. మానవుడు మాధవుడు కావడము, దానవుడు కావడము తన చేతిలోనే యున్నది. భగవంతుడు మానవునికి సర్వ స్వతంత్రతనిచ్చియున్నాడు. ఈ విచక్షణాజ్ఞానాన్ని తెలుసుకొనుటయే మానవ ధర్మము.

పశుపక్ష్యాది జన్మలు, దేవతాది జన్మలు కేవలము భోగజీవులేకాని, యోగజీవులు కారు. ఆత్మజ్ఞాన సంపాదన కేవలం మానవజన్మలోనే గలుగును.

“ ఆత్మజ్ఞాన విహీనమూఢాః తే పశ్యన్తి నరకనిగూఢాః ”

ఆత్మజ్ఞానము లేనివారు నరకమును పొందుదురని శాస్త్రము.

ఇహచేదవీదీదథ సత్యమస్తి, నచేదిహావేదీ

న్మమహతీవినష్టిః ! భూతేషు భూతేషు విచిత్యధీరాః

ప్రేత్యాస్మాన్లో కా దమృతో భవన్తి ”

ఇహచేదశకద్బోద్ధుం ప్రాక్ఛరీరస్య విస్రసః ।

తతస్సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే ”

ఈ భూలోకంలో ఆత్మజ్ఞానమును అనగా తన్ను తాను తెలిసికొనినవాని జన్మయే జన్మము. అతడే అమృతస్వరూపుడగు

చున్నాడు. ఈ దేహం విడచి పెట్టకముందే ఆత్మజ్ఞానము తెలిసి కొనకపోతే పృథివ్యాది లోకముల యందు మాటి మాటికి పుట్టుచు చచ్చుచు సంసార బంధమునందు తగుల్కొనును. అటువంటి వారు ఆత్మహనో జనాః ఆత్మహంతకులని ఈశావాస్యోపనిషత్ చెప్పుచున్నది. మానవజన్మయే గొప్పది. "దుర్లభంత్రయమేవైత ద్దైవానుగ్రహ హైతుకమ్। మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః॥ అని ఈవిధంగా జగద్గురు శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో చెప్పి యున్నారు.

లోకములో నున్న జీవరాశులన్నిటినిలోను మానవజన్మయే అత్యంత శ్రేష్ఠమైనది. మానవునకు స్వభావాన్ని మార్చుకొని. స్వరూపాన్ని తెలుసుకొనే యోగ్యత యున్నది. పశుపక్ష్యాదులకు ఈ రెండును లేవు.

మానవులలో ముముక్షుత్వాన్ని పొందినవాడు గొప్ప శ్రేష్ఠుడు. మోక్షము కొరకు ప్రయత్నం చేయువారు, మోక్షము కావాలని కోరు వారెవరైన స్త్రీలు గాని, పురుషులు గాని, బ్రాహ్మణులు గాని, ఇతరులు గాని వారందరూ ముముక్షువులనబడెదరు. చాలామంది జనులు సేవలు పూజలు, జపధ్యానములు యజ్ఞములు వీటినే చేయుచుందురు. మోక్షసాధన అయిన ఆత్మానాత్మ విచారణ చేయరు. సత్సంగములలో పాల్గొనరు. ఆత్మకు సంబంధ గ్రంథములను చదవరు. పూజాదుల వలన కేవలము పుణ్యము వచ్చును. కాని మోక్షము రాదు. మోక్షసాధనకు యోగ్యమైన జ్ఞాన సంపాదనకు తగు అంతఃకరణ శుద్ధి గలుగును. ఆత్మవిచారణ ద్వారానే జ్ఞానము కలిగి మోక్షము పొందెదరు.

ఈ మోక్ష విషయమును బాగుగా తెలుసుకొనుటకు మహాపురుషుల నాశ్రయించువారు అత్యంత మహాశ్రేష్ఠులు. **మహాపురుషులనగా :** శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, సాధన చతుష్టయ సంపన్నులు, వేదములను బాగుగా నధ్యయనమును చేసి వేదార్థమును బాగుగా తెలుసుకొని స్వయముగా

ఆచరించి, వేదముల కాధారమైన వేదాన్త వాక్యములచే బుద్ధికి గోచరమైన పరబ్రహ్మము సర్వమున కాధారభూతమైనది, అందరియందు సమానముగా నున్నదని, తనయందు అదే గలదని నిశ్చయించి దానియందే నిష్ఠ గలిగి ఆ పరబ్రహ్మమే నేనని దృఢాపరోక్ష జ్ఞానము గల వాడే బ్రహ్మనిష్ఠుడు. ఇటువంటి శ్రోత్రియ బ్రహనిష్ఠు నాశ్రయించిన వారు మానవులలో అత్యన్త ఉత్తములు. ఈ సాధకులు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుల ద్వారా తత్త్వమసీతి మహావాక్యములు శ్రవణం చేసి మనన నిదిధ్యాసులై తామును బ్రహ్మనిష్ఠులగుదురు. జనన మరణ రహితులై బ్రహ్మానంద భరితులై జీవన్ముక్తులగుదురు. ఈ స్థితిని పొందుటయే మానవజన్మ సార్థకత.

ఓం లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు ఓం తత్సత్ ఓమ్

జ్ఞాన సదస్సు

ఇకపైన ప్రతినెల శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జ్ఞాన సదస్సు నడుపవలెనని పూజ్యశ్రీ స్వాములవారు నిర్ణయించారు.

అందు. 1. జపము, 2. ధ్యానము, 3. ఉదయం, సాయంకాలం ఒక ఆధ్యాత్మిక గ్రంథంపైన పాఠము, 4. ఏదైన ఒక పారాయణ ఉండును. ఇందులో పాల్గొనవలసినవారు ఒక నెల ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు " మేనేజర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమము వారికి వ్రాసి తెలుసుకోగలరు. ఫోన్‌లో అడుగరాదు.

ఇట్లు

ఆశ్రమ పరిపాలనా సంఘము

శుకమహర్షి బోధ

- ఎస్.వి. భారతీలక్ష్మి (భీమవరం)

(జూలై సంచిక తరువాయి)

సముద్రము నందు తరంగములుత్పన్నములై మరల సముద్రమునందే లయించును. అట్లే. ఆత్మయందు బంధమోక్షములు గలిగి ఆత్మయందే లీనమగును. కల్పితమైన సంకల్పమే బంధము. సంకల్ప నివృత్తియే మోక్షము. తరంగములు. సముద్రము యొక్క స్వభావము కానట్లే బంధమోక్షములు ఆత్మ యొక్క స్వభావములు కావు. మాయాకల్పితములగు బంధమోక్షములు. సృష్టికాలము నందు మాత్రమే స్ఫురించును. కనుక వానిచే ఆత్మ వికారము చెందదు. రెండు సంకల్పముల మధ్యనున్న సంధియందు ఆత్మ స్థితమైయుండును. అదియే స్వరూపస్థితి. అట్టి స్థితి యందున్న వానికి వాసనారూపమగు అజ్ఞానము నశించి అద్వైత బ్రహ్మానుభవము గలుగును. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి ' బ్రహ్మము నెఱిగిన వాడు బ్రహ్మమే యగునని శ్రుతిమాత చెప్పుచున్నది. సుఖదుఃఖములు జలపంకములవలె ఒకదానియందొకటి స్థితమై యుండును. అట్లే, జగత్తు బ్రహ్మమయం 'సర్వం బ్రహ్మైవ భవతి ' బ్రహ్మము నందు జగత్తు వ్యాపించి యున్నది. బ్రహ్మము సుఖ స్వరూపము. జగత్తు దుఃఖమయము. జగత్తు నందు బ్రహ్మమును దర్శించు సాధకునికి సుఖదుఃఖములంటవు. నిద్రాసక్తి వలన గలిగిన స్వప్నవిషయములు జీవునికంటని విధంగా మాయాశక్తి వలన గలిగిన సుఖదుఃఖములు ఆత్మను వికృతము చేయజాలవు. స్వప్నకాలంలోని రథతురగాదులు స్వప్న సమయంలో సత్యమనిపించినను జాగ్రత్ పురుషుడు వాటిని తాకుటలేదు. కాబట్టి, జీవుడు (పురుషుడు) అసంగుడు. స్వప్నగత పదార్థములకు

ప్రాతిభాసికములని పేరు. అనగా స్వప్నంలో మాత్రమే అనుభవానికి వస్తాయి. జాగ్రత్తులోని పదార్థములను వ్యావహారికములందురు. సుషుప్తిలోని అనుభవం పారమార్థికం. చిత్తమును విభ్రాంతి కలిగించు జాగ్రత్ప్రపంచము దీర్ఘస్వప్నము. స్వప్నదశలో యజమాని సేవకుడు, తండ్రి కొడుకు మొదలైన సంబంధములు జీవునికంటనట్లే స్వప్నతుల్యములగు జాగ్రత్తులోని సుఖదుఃఖములు పరమాత్మను తాకజాలవు.

పారమార్థికం పరమార్థానికి సంబంధించిన అలౌకిక జీవితం. పరమార్థం అంటే అన్నిటికన్నా గొప్పదైనది. అదే పరబ్రహ్మం. జాగ్రత్తు నందు ద్వైతమును చూచుచున్నప్పటికి ద్వైతముగా భావింపనివాడు, కర్మ చేయుచున్నను అకర్మణ్యస్థితియందున్నవాడు, కొండల వంటి కష్టములలో కూడా ధైర్యమును విడువని వాడు కామాది అరిషడ్వర్గములను జయించుటకు సింహము వంటి పట్టుదల గలవాడు. పిడుగులవంటి ఆపదలనుభవించు సహనము గలవాడు, పారమార్థిక జీవుడని చెప్పబడును. అతడే ఆత్మజ్ఞాని అతడే జీవన్ముక్తుడు. సాలెపురుగు తన నోటి నుండి దారమును సృష్టించి తనలోనే లయం చేసికొన్నట్లు పారమార్థిక జీవుడు జాగ్రత్స్వప్నములను సృష్టించి, ఉపసంహరించుచు సాక్షీమాత్రంగా ఉంటాడు. అధ్యారోప అపవాద పూర్వకముగ బ్రహ్మము నందు నానారూప జగత్తును ఆరోపించి పిమ్మట బ్రహ్మజ్ఞానముచే అపవదించి 'సర్వం బ్రహ్మైవ కేవలమ్' అను శ్రుతి ననుసరించి జగత్తును బ్రహ్మముగా చూస్తాడు. అధ్యారోపమనగా, సత్పదార్థమగు బ్రహ్మము నందు అసత్పదార్థమగు జగత్కల్పన.

ఉదా : రజ్జువునందు సర్పమును, శుక్తియందు రజతమును భావించుట అధ్యారోపము. రజ్జువును తెలిసికొని సర్పభావమును, శుక్తిని గ్రహించి రజతభావమును నిరసించుట అపవాదము. బ్రహ్మజ్ఞానముచే యథార్థవస్తువగు పరబ్రహ్మమును గుర్తించి ఆరోపిత జగద్భావమును

(దేహాత్మ భావనను) నిరసించుట అపవాదము.

అజ్ఞానమనే శిశిరం గడచినంతనే ఈశ్వర ధ్యానమనే వసంతం వచ్చి పాపములనే యెండుటాకులు రాలిపోయి భక్తిలతలు ప్రాకి పుణ్యమనే చిగుళ్ళు తొడుగును. మంత్ర వాక్కులనే సద్వాసనలు గల పుష్పములు వికసించును. ఆత్మానాత్మ వివేకము వలన గలిగిన ఆనందామృతమనే పుష్పరసము స్రవించి బ్రహ్మజ్ఞానమనే ఫలము ఫలించును. సాధకుని నిరంతర సాధన ఫలించ అపరోక్ష జ్ఞానమనే ఫలము నొసంగును.

సూర్యకాంత ఫలకమునందు ప్రతిబింబించిన సూర్యకిరణములచే అగ్ని పుట్టునట్లును, చందన వృక్షమునకు ప్రక్కనున్న వృక్షమునకు చందన పరిమళము అబ్బినట్లును, అయస్కాంతము యొక్క సామీప్యము వలన ఇనుమునకు స్పందన శక్తి గలిగినట్లును, వ్యాపక చైతన్యస్వరూపమగు పరమాత్మననుసరించు ప్రకృతికి చేతనత్వము గలుగుచున్నది. అనగా, ఆత్మ యొక్క సాన్నిధ్యము వలన ప్రకృతి జీవులు కర్తృత్వము వహించి చరించుచున్నారు.

చిత్స్వరూపియైన పరమాత్మ క్షేత్రజ్ఞుడని చెప్పబడును. క్షేత్రజ్ఞుడే జీవుడు. వాసనాకల్పితుడైన జీవుడు నియామకత్వమున అహంకార రూపమును పొంది, నిశ్చయాత్మకమగు బుద్ధిగా, సంకల్ప రూపమగు మనస్సుగా, ఇంద్రియత్వముగా పరిణమించి విషయవాసనలనే రజ్జువులచే బంధింపబడుచున్నాడు. విషయవాసనలు విషము కంటె ప్రమాదకరము. విషము తింటే హాని చేస్తుంది. కాని, విషయములు స్మరించినంత మాత్రమున సాధకుని బుద్ధిని నాశనం చేయును. విషయ సంకల్పములకు భోగేచ్ఛ కారణము. భోగేచ్ఛకు స్త్రీ సాంగత్యము కారణము. స్త్రీ సాంగత్యము విడచినచో జగద్భ్రాంతి నశించును. భ్రాంతి నశించినంతనే జీవుడు

సుఖియగును. సుఖియనగా, ఆనంద స్వరూపుడని భావము.

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అనునవి పంచక్లేశములు. ఇవి జీవుని అనాత్మ ప్రపంచంలోనికి లాగి కట్టిపడేసే పాశములు. అవిద్య అనగా, అజ్ఞానము. అనగా, ఆత్మజ్ఞానం లేకపోవడం. దుఃఖరూపమగు దేహమును సుఖరూపమగు ఆత్మగా భావించుట అనగా, దేహాత్మభావమే అవిద్యాక్లేశము. అనగా, శరీరాదులు నేనని ఉపాధులతో తాదాత్మ్యం చెందుటను అస్మితాక్లేశమందురు. విషయసుఖముల పట్ల ఆసక్తిని కలిగించి, బుద్ధిని అంటి పట్టుకొని కలుషితం చేసేది. రాగక్లేశము. ఫలితము విఫలమైనప్పుడు కలిగే చిత్తవృత్తి ద్వేషము. అనగా తాను కోరిన విషయసుఖములు లభింపక పోవుటకు కారణమైన వారిపై శతృత్వము కలిగించునది ద్వేషక్లేశము. ఇది సాధకుని మనస్సును స్థిరముగా నుండనీయదు. జగత్తు అసత్యమని తెలిసినప్పటికి విడువ లేకుండుట అభినివేశము. అవిద్య ఆత్మను గుర్తు రానీయక అనాత్మను చూపుతుంది. అభినివేశం అనాత్మను ఆత్మగా భావింపజేసి ప్రపంచంలోని క్లేశములన్నింటిని అనుభవానికి తెస్తుంది. ఇది క్లేశములన్నిటికంటె ప్రమాదకరమైనది. దీన్ని తొలగించాలంటే ముందు అవిద్యను తరిమెయ్యాలి. అందుకు బ్రహ్మవిద్యయే సాధనం. అవిద్యను తొలగిస్తే మిగిలిన క్లేశములే గాక ఆశామోహములనే ప్రతిబంధకములు కూడా నిష్క్రమిస్తాయి.

వేదాన్తభేరికి క్రిందివారు పోషక చందా పంపినారు

1. దశక సత్యనారాయణ మూర్తి (ముంబై) - రూ.1200/-
2. శ్రీమంజునాథ్ (దాల్సూరు, కృష్ణగిరి జిల్లా) - రూ.1200/-
3. మామిళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి (హిందూపురం) - రూ. 1500/-
4. టి. మధు (నెల్లూరు) - రూ.1500/-

శ్రీరామానుజ వైభవము

- శ్రీమాన్ కోగంటి సీతారామాచార్య స్వామి, అల్లూరి

శా. శ్రీమద్వైష్ణవ సంఘుమెల్ల నినుసంసేవించి వైకుంఠల
క్ష్మీమూర్ధన్యతనందు నైహికమునన్ శ్రీమంతమై సర్వ సౌ
ఖ్యామోదమ్ముల నందుచుండునని విద్యాసాగరుల్ బల్కునో
స్వామీ ! దాసునిగూడ నట్టెగని విశ్వాసించు రామానుజా !

మ. జనముల్ మూర్ఖగతిన్ చరించునెడ విజ్ఞానమ్ముసంధింప భూ
మిని జన్మించిఇ త్వదీయసన్మతము గంభీరమ్ముగా శాంత వృ
త్తిని క్షేమంకరమైన పద్ధతిని బోధింపంగ రాజ్యమ్ము లం
దున, రాజుల్ గనిమెచ్చు నీమతముగొల్తున్ భక్తి రామానుజా !

శా. " జీవాత్మే పరమాత్మ " యంచును మహాక్షేపమ్ములం జేయుచో
నావాదమ్ముల యుక్తియుక్తముగ మిధ్యాభూతముల్ జేసి యా
శ్రీవైకుంఠ నివాసుడీగతిగ భూరిప్రౌఢ వాదార్భటిన్
నీవే నిక్కపుపూన్కి గెల్చితివి తండ్రీ ! స్వామి రామానుజా !

మ. పరమా మ్నాయపు సారమెల్ల నొక శ్రీ భాష్య స్వరూపమ్ముగా
పరవాదుల్ సభలన్ జితాస్మ యనగా వాదించి శ్రీ వైష్ణవ
స్థిరతన్ బాదుకొనంగ జేసితివిగాదే యట్టి నీ గొప్ప నీ
కరుణన్ నేనెటుసంస్మరింతు వినతక్ష్మాపాల రామానుజా !

మ. పరమోత్కృష్టమునై శుభప్రదమునై వాత్సల్యభావమ్మునై
కరుణావాసమునై సమస్త రిపురేఖాకాననజ్వాలయై
స్థిరమై బౌద్ధమతాగ్ని మేఘమయి యుద్దీపించు నీమార్గ మి
ద్ధర నాచంద్రముగాగ నేనెపుడు నిర్ధారింతు రామానుజా !

శా. కాలమ్మంతయు వమ్ముజేసికొనిఇ దుష్కాంక్షాప్రధానాత్ములై
లోలత్వంబున నీభవాంబునిధి గల్లోల వ్యథాచిత్తులై
కాలప్రేరితులై మునుంగ గని యుత్కంఠన్ మహాప్రేమతో
నాలోకించి వికుంఠమంపితివిగాదా నీవు రామానుజా !

శా. నీ విద్యావిభవమ్ము నీ ప్రతిభ నీ నిర్వ్యాజమౌ ప్రేమయున్
భావింపన్ మముబోంట్ల నెల్ల నిపుడే వైకుంఠముం జేర్పగా
నీవేదైవమవంచు సద్గురుడుగా నిత్యమ్ము నీధ్యానమే
గావంజాల సమర్థమంచెపుడు మ్రొక్కంజూతు రామానుజా !

మ. హృదయమ్మందున శాంతి లేదు, విధులే కృత్యమ్ములాలేవు,
నెమ్మది విజ్ఞానము లేదు, కోవిదులు సంభావించు పాండిత్య మ
న్నది పూజ్యమ్ము, కవిత్వమిట్లెయగు నెన్నన్, మూర్ఖతా మాత్రమే
పదిలంబాయెను, మోక్షమే విధిగ సంపాదింతు రామానుజా !

మ. విలసద్భావ పరంపరల్ పరగనిన్వీక్షించి వర్ణించ మ్రొ
క్కులు బల్ మ్రొక్కితి నేటికయ్యదిమె నాకున్ ప్రాప్తమాయెన్ కవీ
శులు విద్వాంసులు గూడ నెప్పుడు వచించున్ నీ మాహాత్మ్యంబునే
కలముంబట్టి తదీయసూక్తులనె వక్కాణింతు రామానుజా !

(భక్తి నివేదన (పత్రిక) నుండి వారి సౌజన్యంతో)

వార్తలు

(01). శ్రీ కృష్ణానందమంఠం స్వర్ణోత్సవాల సందర్భంగా కడపజిల్లా, జమ్మలమడుగు, మోరగుడి శ్రీ కృష్ణానంద మఠంలో 2017 మార్చి 22వ తేదీ నుండి జరిగిన ఆధ్యాత్మిక సదస్సులో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచన చేశారు.

(02). 29-03-2017 తేది బుధవారం శ్రీహేమళంబి సంవత్సరాది సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలోని శ్రీ నర్మదేశ్వర మహాదేవునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, బిల్వార్చన పూజ్యశ్రీ స్వాములవారు, ఆశ్రమ వాసులు చేశారు. కాశీ నివాసి పూజ్యశ్రీ ఓంకారానంద,తిరుపతి బ్రహ్మచారి శ్రీ పి శ్రీనివాసరావులు వేదపారాయణ, పంచాంగ పఠన చేశారు.

(03). 2-4-2017 తేది ఆదివారం, తమిళనాడు రాష్ట్రం, తిరుత్తణి తాలూకా శ్రీ వటారణ్యక్షేత్ర (తిరువాలంగాడు) సమీప కావేరి రాజపురం గ్రామంలో నూతన నిర్మిత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కుంభాభిషేక సందర్భంగా పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని అనుగ్రహ భాషణ చేశారు.

(04). 5-4-2017 బుధవారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శ్రీ సీతారామ లక్ష్మణులకు షోడశోపచార పూజ జరిగి ప్రసాద వినియోగం జరిగినది.

(05). 7-4-2017 తేది చైత్రశుద్ధ ఏకాదశి నాడు పరమ గురుపూజ్యపాద శ్రీశ్రీశ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారి జన్మదినోత్సవం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది.

(6). 10-4-2017 తేది గురుదేవులు పరమ పూజ్య శ్రీ విద్యాప్రకాశానంద గిరిస్వాములవారి 19వ ఆరాధనోత్సవం శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. గురుదేవుల మూర్తికి పవిత్రాభిషేకాలు, అర్చన జరిగింది. 14-4-2017 తేది గురువేదుల జన్మదినోత్సవం సందర్భంగా స్వామివారి పాదుకలకు పూజ జరిగినది. అనేక మంది మహాత్ములు, అనేక ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఇందులో పాల్గొన్నారు.

(07). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో మార్చినెలలో ఓ.పి.లో 962 మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. 80 మందికి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. 7 మందికి లేజర్ చికిత్సలు చేయబడినవి.

RAZIYA WEDS

WEDS

RAFI

ENGAGEMENT WEDS

DT : 08.03.2015